
సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



వర్సిటీ అభివృద్ధికి సమష్టి కృషి

తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన ఆదికవి నన్నయ యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించడానికి సమష్టి కృషి అవసరమని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. - IIలో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం గోదావరి తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు.

నిత్యాన్నదాన భవనానికి విరాళాలు



ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి యడ్ల పార్థసారథి దంపతులు (విజయవాడ) రూ.1,07,001, ఆచంట విజయ నరేష్ దంపతులు (పెన్నాడ) రూ.1,00,116 చొప్పున సోమవారం విరాళాలు సమర్పించారు.

గురుదేవోభవ

- పాఠాలు చెప్పడంలో నూతన ఒరవడి
- వినూత్న పద్ధతులు అవలంబిస్తున్న ఉపాధ్యాయులు
- విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన

ఉపాధ్యాయుడంటే కేవలం పాఠాలు చెప్పడమే కాదు. అందుకోసం కొంత స్వయం కృషి చేయాలి. సృజనాత్మకతను జోడించాలి. అవసరమైన బోధనోపకరణాలు తయారు చేయగలగాలి. ఆపై తమ బోధనా నైపుణ్యంతో ఆకట్టుకునేలా, అర్థమయ్యేలా పాఠం చెప్పగలగాలి. అంతే కాదు.. తమ నడవడికతో, సేవా దృక్పథంతో విద్యార్థులకు ఆదర్శంగా ఉండగలగాలి. ఉపాధ్యాయులు ఇంత శ్రమ పడితే.. వారి వద్ద చదువుకునే విద్యార్థులు తరగతి గదికే కట్టుబడి ఉంటారు. పాఠశాలకు ఎప్పుడెప్పుడు వెళ్దామా.. ఆ మాస్టారి పాఠం ఎప్పుడు విందామా అంటూ ఉవ్విళ్లూరుతారు. అదిగో.. అటువంటి వినూత్న పద్ధతుల్లో బోధిస్తున్నారు ఈ ఉపాధ్యాయులు.

- రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/సీతానగరం/గోపాలపురం

బోధనోపకరణాలతో విద్యాబోధనే నరసమాంబ ప్రత్యేకత



బోధనోపకరణాలతో విద్యార్థులకు బోధిస్తున్న నరసమాంబ

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధనోపకరణాలు (టీచింగ్/లెర్నింగ్ మెటీరియల్ - టీఎల్ఎం) రూపొందిస్తూ, వాటితో వారికి అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారు రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులోని సంతోష్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ కేవీఎస్ఎల్ నరసమాంబ. 1997 ఆగస్టులో ఆమె ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టారు. తండ్రి సలహా మేరకు పాత అట్టలపై చార్టులు అతికించి, రంగురంగు పెన్నులతో ఆమె రూపొందించిన 150 రకాల బోధనోపకరణాలు విద్యార్థులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఆమె పాఠాన్ని విద్యార్థులు ఆనందంగా, ఆసక్తిగా వింటూంటారు. నరసమాంబ బోధన తీరుతో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అంతేకాదు.. వారు అస్సలు మానకుండా స్కూలు వస్తున్నారు. కేవలం పాఠశాల విద్యార్థులకే కాకుండా.. అందరికీ అందుబాటులో ఉంటుందనే ఆలోచనతో 'లక్ష్మీస్ టీఎల్ఎం కార్నర్' అనే యూట్యూబ్ చానల్‌ను కూడా నరసమాంబ టీచర్ ప్రారంభించారు. దీనికి విశేష స్పందన లభించింది. దీంతో పాటు 2018 నుంచి ఏపీ టీఎల్ఎం ఫ్యాక్టరీ అనే వాట్సాప్ గ్రూప్‌ను ఆమె ఏర్పాటు చేశారు. ఇందులో దేశవ్యాప్తంగా సభ్యులను చేర్చారు. ఈ గ్రూపులో వచ్చిన టీఎల్ఎంలు చూసి, అందరూ ఎంతో ఉత్సాహంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. వీటిల్లో ఉత్తమ టీఎల్ఎంకు సర్టిఫికెట్, మెమెంటో అందిస్తున్నారు. విద్యామృత్ మహోత్సవ్‌లో నరసమాంబ రూపొందించిన టీఎల్ఎం జాతీయ స్థాయికి చేరుకుంది. ఈ కృషి తనకు ఎంతో సంతోషంగా ఉందని నరసమాంబ చెప్పారు.

తనకు కంటి వెలుగు లేకున్నా.. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతూ..



డిజిటల్ బోధన చేస్తున్న అంధ ఉపాధ్యాయుడు శ్యాంప్రసాదరావు

తన కంట్లో వెలుగు లేకున్నా.. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు కార్యంశెట్టి శ్యాంప్రసాదరావు. గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన అంధత్వంతో బాధ పడుతున్నారు. ఆ బాధను అధిగమించి మరీ విద్యా బోధనలో మేటిగా నిలుస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా శ్యాంప్రసాదరావు మిగిలిన ఉపాధ్యాయులకన్నా మిన్నగా దృశ్య, శ్రవణ విద్యా బోధన చేస్తున్నారు. తనదైన శైలిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, చదువుపై ఆసక్తి పెంచుతున్నారు. ఈ ఏడాది ఆయన విద్యార్థులు భౌతిక శాస్త్రంలో నూరు శాతం ఉత్తీర్ణులు కావడం విశేషం.

సాంకేతికత సాయంతో..



బోధనోపకరణాల సాయంతో గణితం బోధిస్తున్న సతీష్‌బాబు

సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తున్న కన్నూరి సతీష్‌బాబు సాంకేతికత సహకారంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంటారు. 2017లో ఏలేశ్వరం నుంచి సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ వచ్చిన ఆయన హైస్కూల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. రామానుజన్ గణితం పరీక్షలు నిర్వహించి, విద్యార్థులను ప్రోత్సహిస్తారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనం పొందడానికి కృషి చేస్తున్నారు. జూనియర్ రెడ్‌క్రాస్‌లో పాఠశాల నోడల్ టీచర్‌గా ఉంటూ రెండుసార్లు జిల్లా కలెక్టర్ నుంచి బెస్ట్ యాక్టివిటీ అవార్డులు అందుకున్నారు. కరోనా సమయంలో జూమ్, గూగుల్ మీట్‌తో పాటు తన యూట్యూబ్ చానల్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించారు. రెండేళ్లుగా జిల్లా సైన్స్ సమన్వయకర్తగా అటు సైన్స్ ప్రయోగాల్లో కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన విద్యా శాఖ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుతో సత్కరించింది. తన పేరిట కేఎస్‌బీ ట్రస్ట్ ప్రారంభించి అనేక సేవా కార్యక్రమాలను సతీష్‌బాబు నిర్వహిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

వినూత్న బోధనతో..

వినూత్న బోధనతో పిల్లలకు ఆహ్లాదకరంగా అర్థమయ్యేలా పాఠాలు చెప్పడం ఆమెకు అలవాటు. అదే ఆమెకు ఎన్నో అవార్డులు తెచ్చి పెట్టింది. రాజమహేంద్రవరం నాగరాజా మున్సిపల్ స్కూలులో హెచ్‌ఎంగా పని చేస్తున్న మోటూరి మంగారాణి నాలుగో తరగతిలో ఇంగ్లిష్ పాఠ్య పుస్తకం రచయితగా ఎంపికై, జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. విద్యార్థులను ఆకట్టుకునేలా, వారికి అర్థమయ్యేలా మంగారాణి టీఎల్ఎం రూపొందిస్తారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి డెవలప్‌మెంట్ ఆఫ్ ఆన్‌లైన్ కోర్సు పేరిట ఈ ఏడాది మార్చి 3న రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్‌గా ప్రతిభా పురస్కారం అందుకున్నారు ఆమె. 'మంగారాణి లెస్సన్స్' పేరుతో యూట్యూబ్‌లో పాఠాలు ప్రసారం చేసి, ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు అందుకున్నారు. ఆమె అందిస్తున్న యూట్యూబ్ పాఠాలను 7.39 కోట్ల మంది వీక్షించారు. నన్నయ యూనివర్సిటీ నుంచి వుమెన్స్ ఎంపవర్‌మెంట్ అవార్డు, తెలంగాణకు చెందిన సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యాన సావిత్రీబాయి పూలే సేవా పురస్కార్, హైదరాబాద్‌కు చెందిన విజ్ఞాన దర్శిని బెస్ట్ టీచర్ అవార్డు వంటివెన్నో మంగారాణి అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న సెంటా అవార్డుకు కూడా జిల్లా నుంచి ఆమె ఎంపికయ్యారు.



మోటూరి మంగారాణి

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



మార్పులకు అనుగుణంగా బోధన



ఝాన్సీరాణి తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలిస్తున్న పూర్వ ఎంపీడీఓ (ఫైల్)

ఆధునిక మార్పులకు అనుగుణంగా టీఎల్ఎం రూపొందించుకుంటూ బోధన సాగిస్తున్నారు గోపాలపురం మండలం చెరుకుమిల్లి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కప్పల ఝాన్సీరాణి. నిత్యం ఇంట్లో వాడే వస్తువులతోనే టీఎల్ఎం తయారు చేస్తూ, వాటి సాయంతో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెబుతూ ఆకట్టుకుంటున్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న పరిజ్ఞానంపై ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన స్మార్ట్ టీవీ ద్వారా యూట్యూబ్‌లో చిన్నారులకు వివరిస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 36 మందికి పురస్కారాలు ప్రదానం చేస్తారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం ఈ వివరాలు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలత, ఇతర అధికారులు హాజరు కానున్నారని వివరించారు.

సీఎం జగన్‌ను కించపరిస్తే సహించేది లేదు

లోకేష్‌కు ఎంపీ భరత్‌రామ్ హెచ్చరిక



రాజమహేంద్రవరం సిటీ: పంచాయతీ వార్డు సభ్యునిగా గెలిచే సత్తా లేని నారా లోకేష్.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్ధరాత్రి పాదయాత్ర చేసే ముద్దపప్పు గురించి ఎక్కువ మాట్లాడి, తన స్థాయిని దిగజార్చుకోవడం ఇష్టం లేదని అన్నారు. సీఎం జగన్‌పై అవాకులు, చెవాకులు, కించపరిచే పదాలు వాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఏ అర్హతతో లోకేష్ పాదయాత్ర నిర్వహిస్తున్నాడని ప్రశ్నించారు. ఎన్టీఆర్ మనవడు, చంద్రబాబు కొడుకు, బాలకృష్ణ అల్లుడిగా తప్పితే ఆయనకు మరో హోదా లేదన్నారు. ఆయన పాదయాత్ర లక్ష్యం ఏమిటో కూడా తెలియదన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకైతే తమ నేత జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా పాదయాత్ర చేయాలే తప్ప, అర్ధరాత్రి మూడింటికి పాదయాత్ర ఎవరూ చేయరని ఎంపీ భరత్‌రామ్ అన్నారు.

స్పందనకు 100 అర్జీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు 100 అర్జీలు సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ నరసింహులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో 82, ఆఫ్‌లైన్‌లో 18 అర్జీలు వచ్చాయని తెలిపారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా ఎటువంటి అలసత్వానికీ తావు లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో అర్జీలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు.

పోలీసు స్పందనకు 25 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 25 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎం.రజని ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిల్లా వ్యాప్తంగా 11 సివిల్, 6 కుటుంబ తగాదాలు, 8 ఇతర ఫిర్యాదులు అందాయి. అర్జీదారులతో ఏఎస్పీ రజని నేరుగా మాట్లాడారు. జోనల్ డీఎస్పీల సమక్షంలో వారి సమస్యలు విన్నారు. వాటిపై వెంటనే విచారణ జరిపించి, జాప్యం లేకుండా పరిష్కరించాలని డీఎస్పీలను, పోలీసు అధికారులను ఆదేశించారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



నియామక పత్రాలు అందిస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కొత్తగా గ్రూప్-4 కింద నియమితులైన ఉద్యోగులు మానవతా విలువలతో బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. జూనియర్ అసిస్టెంట్లుగా నియామకం పొందిన తొమ్మిది మందిని జిల్లాలోని వివిధ తహసీల్దార్ కార్యాలయాల్లో నియమిస్తూ సోమవారం ఆమె ఉత్తర్వులు అందజేశారు. వారికి అభినందనలు తెలిపారు. ఎంతో బాధ్యతతో, సేవాతత్పరతతో ప్రభుత్వ ఉద్యోగం చేయాలని సూచించారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు జి.ప్రణయ కుమార్, సీతానగరానికి కె.సుధీర్‌కుమార్, కడియం వై.హరిణి సుధ, రంగంపేటకు సీహెచ్ దినేష్‌కుమార్, రాజానగరం సీహెచ్ సాయి గంగాధర్, అనపర్తి ఎ.లక్ష్మీ నాగచైతన్య, బిక్కవోలు ఎస్‌డీ గీతా నైమిష, కోరుకొండ ఎండీ సల్మా సుల్తానా, రాజమహేంద్రవరం రూరల్‌కు బి.రాజేష్‌ను కేటాయించారు.

రత్నగిరి.. కిక్కిరిసి..

- భక్తులకు తోడు నవదంపతులు, పెళ్లిబృందాలతో రద్దీ
- 3,500 వ్రతాల నిర్వహణ
- రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న నవదంపతులు, భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి రెండు రోజులుగా భక్తులతో కిటకిటలాడుతోంది. సామాన్య భక్తులకు నవదంపతులు, వారి బంధుమిత్రులు కూడా తోడవడంతో సోమవారం కూడా రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులతో పాటు వచ్చిన పెళ్లిబృందాలు, ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న వారు రత్నగిరికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడయ్యారు. దీంతో సత్యదేవుని సన్నిధిలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. స్వామివారి ఆలయం, వ్రత మంటపాలు, క్యూలు, విశ్రాంతి మంటపాలు భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట చొప్పున సమయం పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

శిఖర దర్శనానికి పోటెత్తిన భక్తులు

సత్యదేవుని శిఖర దర్శనానికి కూడా భక్తులు పోటెత్తారు. ఆలయ శిఖరం దర్శించేలా యంత్రాలయం వెలుపల అధికారులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రధానాలయ శిఖరాన్ని దర్శిస్తున్నారు. దీంతో అక్కడ కూడా రద్దీ ఏర్పడుతోంది. ఇక్కడి నుంచి శిఖరం దర్శించేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పెయింట్‌తో చదరపు గడిని ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాటు చేశారు. సత్యదేవుని సన్నిధికి వచ్చిన భక్తులు అక్కడి నుంచి శిఖర దర్శనం చేసుకుంటున్నారు.

8 నుంచి సీఫుడ్ ఫెస్టివల్

- నేడు టూకే రన్
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరంలో సీఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో ఈ ఫెస్టివల్ జరుగుతోందని చెప్పారు. సీ ఫుడ్ వినియోగాన్ని పెంచడం, వాటి ద్వారా లభించే పోషక విలువలపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ ఫెస్టివల్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. వీటితో వండే వంటలపై ప్రజలకు సమగ్రంగా వివరిస్తారన్నారు. సీ ఫుడ్‌ను ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచుతారన్నారు. సీ ఫుడ్ ఫెస్టివల్ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి కార్పొరేషన్ కార్యాలయం టూకే రన్ జరుగుతుందన్నారు. దీనిని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, భూమి ఆర్గానిక్ సంస్థ అధినేత రఘురామ్, ఇతర జిల్లా అధికారులు ఉదయం 7.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం 11 గంటలకు సీ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభమవుతుందని, అదే రోజు మధ్యాహ్నం ఫిష్ ఆంధ్రా డొమెస్టిక్ మార్కెటింగ్ లబ్ధిదారులు, సరఫరాదారులతో సమావేశం నిర్వహిస్తామని వివరించారు. తొమ్మిదో తేదీన ఆక్వా రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదార్లతో ఉదయం సదస్సు, మధ్యాహ్నం వివిధ ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు సదస్సు, ఆక్వా ఉత్పత్తుల్లో పోషక విలువలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. మూడో రోజైన పదో తేదీన ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని, అనంతరం ముగింపు వేడుకలు నిర్వహిస్తామని వివరించారు. ఈ మూడు రోజుల కార్యక్రమాల్లో మంత్రులు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు, మత్స్యశాఖ సహాయ సంచాలకుడు ఎస్కే దిల్షద్, పర్యాటక శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈడీ వి.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.


జూ. కళాశాల ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం



గారపాటి సతీష్

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ జూనియర్ కళాశాలల విభాగంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో మంగళవారం జరిగే కార్యక్రమంలో ఆయ ఈ అవార్డు అందుకోనున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సెమినార్లు, క్విజ్‌లు ఆయన నిర్వహిస్తున్నారు. అలాగే, సామాజిక కార్యక్రమాలు, ఆరోగ్యకరమైన ఆహార విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. 2001లో ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధుల్లో చేరిన ఆయన 2018లో కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఆ కళాశాలలో అడ్మిషన్లు, ఉత్తీర్ణత శాతం పెంచారు. 2020 బదిలీపై కొవ్వూరు వచ్చారు. ఏపీ దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి, నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా శిరీష కుమారి



పిట్టా శిరీష కుమారి

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల జెడ్పీ హైస్కూలులో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పిట్టా శిరీష కుమారి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో మంగళవారం జరిగే కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు అందుకోనున్నారు. గత 25 ఏళ్లుగా ఆమె ఉపాధ్యాయినిగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. కరోనా సమయంలో వినూత్న రీతిలో 60 వీడియోల ద్వారా, జూమ్ ద్వారా విద్యార్థులకు బోధించారు. శిరీషా లెస్సన్స్ యూట్యూబ్ చానల్ ద్వారా నాలుగో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ తెలుగు సబ్జెక్టు పాఠాలు రూపొందించారు. దీక్షా యాప్ ద్వారా ప్రభుత్వానికి బోధనా పద్ధతి వీడియోలు అందించారు. అలాగే ఎనిమిదో తరగతి పాఠ్య పుస్తక రచనలో పాలు పంచుకున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) నిర్వహించే ఏపీ ఈ-పాఠశాల యాప్‌లో 8, 9, 5 తరగతులకు శిరీష కుమారి 27 వీడియోలు తయారు చేశారు. 32 వీడియోలకు క్వాలిటీ చెకర్, రివ్యూవర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయులకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ, పాఠ్య ప్రణాళికలు, తెలుగుకు సంబంధించి సలహాలను రాష్ట్రంలోని తెలుగు పండితులకు శిరీషా లెస్సన్స్ వాట్సాప్ గ్రూపు ద్వారా అందిస్తున్నారు. శిరీష కుమారి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేసింది.

మేఘమా.. వర్షించుమా..

- ఆగస్టులోనూ వానలు తక్కువే..
- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- వర్షపాతం లోటు 112.5 మిల్లీమీటర్లు



కొవ్వూరు: ఈ ఏడాది విచిత్రమైన వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమవుతోంది. ఉరుములు, మెరుపులతో హడావుడి చేస్తోంది. కానీ, వర్షాలు అప్పుడప్పుడు మాత్రమే కురుస్తున్నాయి. మొత్తంగా నైరుతి రుతుపవనాలు ప్రారంభమైన తరువాత జిల్లాలో ఇప్పటి వరకూ తగినంతగా వర్షాలు కురవలేదనే చెప్పాలి. జూన్ నెల నుంచి ఈ నెల రెండో తేదీ వరకూ 616.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 504.3 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. గత ఏడాదితో పోల్చితే ఇది తక్కువే. గత సంవత్సరం ఇదే సమయానికి జిల్లాలో 650.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ స్థాయి కంటే 5.5 శాతం అధికం. ఈ ఏడాది మాత్రం సాధారణ స్థాయి కంటే 112.5 మిల్లీమీటర్లు తక్కువగా (18.2 శాతం లోటు) వర్షాలు కురిశాయి. ఆగస్టు నెలలో సైతం జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. అయితే, వాతావరణ శాఖ లెక్కల ప్రకారం సాధారణ స్థాయికి 20 శాతం అధికం లేదా తక్కువ ఉన్నా సాధారణంగా పరిగణిస్తారు. నైరుతి ఆరంభం నుంచే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనప్పటికీ అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఫలితంగా వ్యవసాయం దాదాపు ఎటువంటి ఆటంకం లేకుండా సాగుతోంది.

- గడచిన మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వర్షాలు తక్కువగానే కురిశాయి.
- జూన్‌లో 25 శాతం, జూలైలో 12.7 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది. ఆగస్టు వచ్చేసరికి ఏకంగా 49.4 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.
- జూన్‌లో ఎనిమిది రోజులు మాత్రమే వర్షాలు కురిశాయి. ఆ నెలలో సాధారణ వర్షపాతం 117 మిల్లీమీటర్లు కాగా 87.4 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది.
- జూలైలో సాధారణ వర్షపాతం 278.4 మిల్లీమీటర్లకు గాను 247.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఆ నెలలో 17 రోజులు వర్షాలు కురిశాయి.
- గడచిన మూడు నెలల్లో ఒక్క తాళ్లపూడి మండలంలోనే అత్యధిక వర్షపాతం నమోదైంది. అయితే, ఇక్కడ కూడా ఆగస్టు నెలలో 72.3 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది.
- సీతానగరం, గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం అర్బన్, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, చాగల్లు మండలాల్లో మూడు నెల సరాసరి వర్షపాతం లెక్కిస్తే సాధారణ స్థాయిలోనే నమోదైంది. మరో తొమ్మిది మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతమే రికార్డయ్యింది.
- గత నెలలో మిగిలిన ఏ ఒక్క మండలంలోనూ సాధారణం కంటే అధికంగా వర్షాలు కురవలేదు. ఆగస్టులో ఐదు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దేవరపల్లిలో అత్యధికంగా 80.3 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సీతానగరంలో 65.4 శాతం, నల్లజర్లలో 76.6, గోపాలపురంలో 67.3 శాతం చొప్పున సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిశాయి. మరో 14 మండలాల్లో కూడా అత్యల్ప వర్షపాతం నమోదైంది.

జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

నెల	సాధారణ వర్షపాతం	కురిసినది (శాతం)	లోటు
జూన్	117.0	87.4	25
జూలై	278.4	247.1	12.7
ఆగస్టు	238.6	120.8	49.4

జూన్ 1 నుంచి సెప్టెంబర్ 2 వరకూ
కురవాల్సిన వర్షం: 616.8 మిల్లీమీటర్లు
మూడు నెలల సరాసరి వర్షపాతం : 504.3 మిల్లీమీటర్లు
లోటు: 112.5 మిల్లీమీటర్లు
గత ఏడాది ఇదే సమయానికి కురిసిన సరాసరి వర్షం: 650.8 మిల్లీమీటర్లు

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి మంత్రి రాజా ఆర్థిక సహాయం



లోవరాజు కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

తుని: ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి అండగా నిలవడం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాకు అలవాటని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు అన్నారు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్న ఉప్పరాపల్లి లోవరాజు కుటుంబ సభ్యులకు మంత్రి దాడిశెట్టి రాజా సమకూర్చిన రూ.రెండు లక్షలు, బాలు, కౌన్సిలర్ అల్లా దివాణం ఇచ్చిన రూ.2 లక్షలు కలిపి రూ.4 లక్షలను సోమవారం తుని మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. 17వ వార్డుకు చెందిన లోవరాజు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. మన మున్సిపాలిటీ, మన బాధ్యత కార్యక్రమంలో సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని బాలు మంత్రి రాజా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులను కూడా అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, వెంకటేశ్వరస్వామి ఆలయ అధ్యక్షుడు అన్నవరం శ్రీను, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

13 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్ బియ్యం

రాజానగరం: ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీలో రాజానగరంలో 13 టన్నుల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని పట్టుకున్నారు. దీని విలువ రూ.11.70 లక్షలు ఉంటుందని అంచనా. ఇందుకు సంబంధించి రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ సోమవారం ఇక్కడ విలేకరులకు తెలిపిన వివరాలిలావున్నాయి. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కొంతమంది స్వార్థపరులు అక్రమంగా రవాణా చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ విధంగా వ్యాన్‌లో అనధికారికంగా తరలిస్తున్న 13,000 కిలోల రేషన్ బియ్యాన్ని రాజానగరంలో కరుణశ్రీ హోటల్‌కి సమీపంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్‌లెస్ అధికారులు పట్టుకున్నారు. కొవ్వూరుకు చెందిన వ్యాన్ డ్రైవర్ కొత్త నరేష్ కొయ్యలగూడెం నుంచి సామర్లకోటకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడు. కొయ్యలగూడెం సమీపంలో షేక్ మీరవల్లి అనే వ్యక్తి ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి చౌకగా కొనుగోలు చేస్తుంటాడు. నరేష్ సాయంతో ఆ బియ్యాన్ని సామర్లకోటకు తరలిస్తుంటారు. పట్టుబడిన బియ్యం విలువ రూ. 11,70,000 ఉంటుందన్నారు. రాజానగరం ఎంఎస్ఓ బియ్యంతో ఉన్న వ్యాన్‌ని సీజ్ చేసి, సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేశారు. నిందితులిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని పోలీసులకు సిఫారసు చేశామని రీజనల్ విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీ కె.కుమార్ తెలిపారు. ఈ తనిఖీలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, కానిస్టేబుళ్లు వలీ, వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్‌లెయ్ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్...

ఆగిఉన్న లారీని ఢీకొని

ముగ్గురు యువకుల మృతి



ఘటనా స్థలంలో మృతదేహాలు

దేవరపల్లి: ఆగిఉన్న లారీని ఢీకొని మోటారు సైకిల్‌పై వెళుతున్న ముగ్గురు యువకులు మృతి చెందారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. చిన్నాయిగూడేనికి చెందిన బొందల శ్రీను (26), వెంగల రాహుల్ (20), తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టకు చెందిన వేము సునీల్ కుమార్ (28) సోమవారం రాత్రి మోటారు సైకిల్‌పై వేగంగా వెళుతూ ఆ గ్రామంలోని ఫ్లైఓవర్ సమీపంలోని ఆగిఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ఘటనలో వారి తలలకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీను, రాహుల్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సునీల్ కుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో కన్నుమూశాడు. దేవరపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న పోలీసు పహారా

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీషీటర్ హత్య, అతని స్నేహితుడిపై హత్యాయత్నం కేసుల నేపథ్యంలో అమలాపురం పట్టణంలో అనివార్యమైన పోలీసు పహారా సోమవారం కూడా కొనసాగింది. 400 మంది పోలీసులతో, 15 పోలీసు పికెట్లతో బందోబస్తు సాగుతోంది. శాంతి భద్రతల పరిరక్షణకు అమలాపురం వచ్చి ఇక్కడే మూడు రోజులపాటు మకాం ఉండి పరిస్థితిని సమీక్షించిన రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఏలూరుకు బయలుదేరి వెళ్లారు. జిల్లా ఎస్పీ సుసరావు శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం కూడా రౌడీషీటర్ హత్య తదనంతర పరిణామాలపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్షించారు. హత్య, హత్యాయత్నానికి పాల్పడ్డ నలుగురు ప్రధాన నిందితులు, ఇతర అనుమానితుల కోసం తొమ్మిది పోలీసు బృందాలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్వేషిస్తున్నాయి. అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న దాదాపు 52 మంది రౌడీ షీటర్లను బ్యాచ్‌లుగా పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్‌లు, వార్నింగ్‌లు ఇస్తున్నారు. రౌడీ షీటర్లకు చెందిన కుటుంబాలు పోలీసు పిలుపులతో వణికిపోతున్నాయి. తమ ఇంట్లో రౌడీ షీటర్ ముద్రవేసుకుని కుటుంబాన్ని వీధికి లాగుతున్న తమ కొడుకుల తీరుపై ఆ కుటుంబీకులు మథనపడుతున్నారు.

పోలీసునని బెదిరించి సొమ్ము కాజేసిన వ్యక్తి అరెస్టు

గండేపల్లి: పోలీసునని బెదిరించి ప్రయాణికుల వద్ద సొమ్ము కాజేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని యల్లమిల్లికి చెందిన పుట్టా వీరభద్రరావు గత నెల 24న తాళ్లూరు నుంచి యల్లమిల్లి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తుతెలియని వ్యక్తి మోటార్ సైకిల్‌పై వచ్చి తాను పోలీస్‌నని తనమాట వినకపోతే ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరించి వీరభద్రరావు నుంచి రూ.10,000 నగదు, వెండి ఉంగరం తీసుకుపోయాడు. అదే రోజు మురారిలో రామయ్యపాలెంకు చెందిన అక్కిరెడ్డి వంశీని బెదిరించి అతని వద్ద నుంచి రూ. 5000 నగదు, ఒక సెల్‌ఫోన్ తీసుకుపోయినట్టు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు పిఠాపురం మండలం ఎఫ్‌కె పాలెంకు చెందిన నల్లా శివను సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్, మోటార్ సైకిల్, రూ.2,000 నగదును స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించారు.

చెట్టుకు మోటార్ సైకిల్ ఢీకొని ఇద్దరి మృతి



ఎదుర్లంకలో బైక్ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన అభిమన్యు

ఐ.పోలవరం: ప్రమాదవశాత్తు చెట్టుకు మోటార్ సైకిల్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుత్తి నదీవి పంచాయతీ పరిధి కరవాకలంకలోని ఒక ప్రైవేటు కంపెనీలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అభిమన్యు(35) ప్రమోద్(28) పనిచేస్తున్నారు. వీరిద్దరూ సోమవారం మోటారు సైకిల్‌పై యానాం వెళ్లారు. యానాం నుంచి తాము పనిచేసే కంపెనీకి తిరిగి వస్తుండగా ఎదుర్లంక భవానిపేట వద్ద కొబ్బరి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అభిమన్యు అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమోద్‌ను యానాం జీజీహెచ్‌కు తరలించగా అతడు కూడా మృతి చెందినట్లు వైద్య సిబ్బంది ధ్రువీకరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్న మృతుల తల్లిదండ్రులకు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

మరదలును హత్య చేసిన బావకు జీవిత ఖైదు

కాకినాడ లీగల్: మరదలును కర్రతో కొట్టి హత్య చేసిన బావ పాలినాటి శ్రీనివాస్‌కు జీవిత ఖైదు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తాళ్లరేవు మండలం పటవల గ్రామంలోని రామాలయం వీధికి చెందిన పాలినాటి శ్రీనివాస్ ఇంటి పక్కన నివసిస్తున్న తమ్ముడి భార్య పాలినాటి మాధవి ఇంటి ముందు రోడ్డుపై గిన్నెలు కడగడంతో ఇద్దరు మధ్య 2018లో ఘర్షణ వచ్చింది. దీంతో ఇంటి ముందు గిన్నెలు కడగవద్దని ఎన్నిసార్లు చెప్పినా, వినడం లేదని కోపంతో కర్రతో గిన్నెలు కడుగుతున్న మరదలు మాధవి తల వెనుక భాగంలో బలంగా శ్రీనివాస్ కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై మృతురాలి భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరింగి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో పాలినాటి శ్రీనివాస్ పై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వర్సిటీ అభివృద్ధికి సమష్టి కృషి

'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు



వీసీ ఆచార్య పద్మరాజు అధ్యక్షతన సమావేశమైన నూతన పాలక మండలి సభ్యులు

రాజానగరం: తెలుగు రాష్ట్రాలలో పెద్ద యూనివర్సిటీగా ఉన్న ఆదికవి నన్నయ యూనివర్సిటీని ప్రగతి పథంలో నడిపించడానికి సమష్టి కృషి అవసరమని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. నూతనంగా ఏర్పడిన పాలకమండలి సభ్యులు వీసీ అధ్యక్షతన సోమవారం తొలి సమావేశాన్ని నిర్వహించారు. యూనివర్సిటీలో విద్య, పరిపాలన తదితర అంశాలు, కొత్తగా మంజూరైన అధ్యాపక పోస్టుల భర్తీలో రేషనలైజేషన్‌ల పై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రరెడ్డి ఆన్‌లైన్‌లో సమావేశంలో పాల్గొని, నూతన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఆయా రంగాలకు చెందిన సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పాలక మండలి సభ్యులు ఆచార్య పి.సురేష్‌వర్మ, డాక్టర్ పి.విజయనిర్మల, డాక్టర్ కె.జ్యోతి, డాక్టర్ కె.నూకరత్నం, వసంతలక్ష్మి, షేక్ సులేమాన్, గంధం నారాయణరావు, రాజ్‌కుమార్, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

పిడుగు పడి మహిళ మృతి



రౌతులపూడిలో పిడుగుపడి మృతి చెందిన సత్యవతి

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలో సోమవారం పిడుగు పడి ఓ మహిళ మృతి చెందింది. పొలంలో వరి నాట్లు వేస్తుండగా ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో అక్కడ పని చేస్తున్న గంపా సత్యవతి (26) తీవ్రంగా గాయపడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త తాతబాబు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వలంటీరుపై జనసేన కార్యకర్తల దాడి

కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు, కేసు నమోదు



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వలంటీరు షేక్ యాకూబ్

కాజులూరు: మండల కేంద్రమైన కాజులూరులో ఒక వలంటీరుపై స్థానిక జనసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో వలంటీరు తీవ్ర గాయలపాలై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా బాధితుని ఫిర్యాదు మేరకు సోమవారం గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోనికి వెళ్లితే కాజులూరు శివారు శ్రీరామ్‌నగర్‌లో 15వ క్లస్టర్‌కు చెందిన వలంటీరు షేక్ యాకూబ్ స్థానిక ఆంజనేయస్వామి గుడి వద్ద కూర్చుని ఉన్నారు. స్థానిక జనసేన కార్యకర్తలైన తలాటం రాజు, తలాటం రాంబాబు, చీకట్ల శివ మద్యం సేవించి వలంటీరు షేక్ యాకుబ్ వద్దకు వచ్చి వారి ఆధార్‌కార్డులు అప్‌డేట్ చేయించమని అడిగారు. గ్రామ సచివాలయంలో ప్రస్తుతం ఆధార్ అప్‌డేట్ చేయడంలేదని, మీ సేవా కేంద్రానికి వెళ్లి చేయించుకోవాలని వలంటీరు సూచించాడు. దీంతో వారు ఆగ్రహానికి గురై ఆధార్ కార్డులు అప్‌డేట్ చేయించలేనప్పుడు నువ్వు వలంటీరుగా పని చెయ్యటం ఎందుకు అంటూ ప్రభుత్వాన్ని, వలంటీరు వ్యవస్థను తీవ్ర పదజాలంతో దూషించారు. వలంటీరు షేక్ యాకూబ్ ప్రతిఘటించటంతో జనసేన కార్యకర్తలు అతనిపై దాడికి దిగి తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న యాకూబ్ తల్లితండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్సులో అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న దిశ పోలీసులు



బాలిక బంధువులతో మాట్లాడుతున్న అధికారులు

నల్లజర్ల: బాల్యవివాహాలను అరికట్టడంలో దిశ యాప్ కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతవరకు 40కిపైగా బాల్య వివాహాలను జరగకుండా నిలుపుదల చేశారు. తాజాగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పుల్లలపాడు గ్రామంలో బాలిక వివాహం జరగకుండా దిశ పోలీసులు అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థినికి ఈ నెల 6న వివాహం చేస్తున్నట్టు గ్రామ మహిళా సంరక్షణాధికారి ఇందిరా ప్రియదర్శినికి సమాచారం అందింది. ఈ విషయం రాజమహేంద్రవరంలోని దిశ పోలీసులకు ఆమె సమాచారం అందించారు. దిశ పోలీసులు తమతో పాటు ఐసీడీఎస్ అధికారులను తమ వెంట తీసుకొని ఆ బాలిక ఇంటికి వెళ్లారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ఆ బాలిక తల్లిదండ్రులకు, పెద్దలకు వివరించారు. బాలిక వివాహాన్ని నిలుపుదల చేయాలని సూచించారు. అందుకు వారు సమ్మతించారు. ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా దిశ, ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు. ఆ బాలిక చదువు కొనసాగించాలని అధికారులు సూచించారు. తమకు సమాచారం అందించిన మహిళా సంరక్షణ అధికారి ఇందిర ప్రియదర్శినిని అధికారులు అభినందించారు. ఎక్కడ బాల్య వివాహాలు జరిగినా దిశ యాప్‌కు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడి

సామర్లకోట: మండల పరిధిలో మాధవపట్నం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బాలికపై అదే గ్రామానికి చెందిన బరికి వెంకన్న అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లి సోమవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో ఈ ఏడాది మార్చి 14న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్ష విధించినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ తెలిపారు. గ్రామానికి చెందిన బొడ్డు శ్రీనుకు చెందిన షాపులో షట్టర్ తాళాలు పగులగొట్టి రూ. 2,50,000 నగదు అపహరించారు. సీసీ ఫుటేజీ సహకారంతో బొడ్డు జయబాబు, నామాల చంటిబాబులు ఆ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. నేరం రుజువు కావడంతో రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరావు నాయక్ వారికి శిక్షను విధించినట్లు తెలిపారు. ఏపీపీ బి. రామతులసి కేసు వాదించారన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

రత్నగిరిపై రేపు జన్మాష్టమి వేడుకలు

- 108 మంది చిన్నపిల్లలకు శ్రీకృష్ణుని వేషం
- ఈఓ చంద్రశేఖర్ అజాద్



రత్నగిరి శ్రీగోకులంలో శ్రీకృష్ణుడు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సత్యదేవుడు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, గోపూజ మహోత్సవం, ఉట్లోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 108 చిన్నపిల్లలకు శ్రీకృష్ణుని వేషం వేయించనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగింపుగా కళావేదిక వద్దకు తీసుకువచ్చి అక్కడ వెండి సింహాసనంపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేస్తారు. అనంతరం పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజ, శ్రీకృష్ణుడికి సహస్రనామ పూజ నిర్వహిస్తారు. తరువాత పండితుల మంత్రోచ్ఛటన మధ్య దేవస్థానం అధికారులు, భక్తులు ఘనంగా గోపూజ నిర్వహిస్తారు. పూజ అనంతరం గోవుల చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి వాటికి బియ్యం బెల్లం తినిపించిన తరువాత గోమాతలకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్లకు వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తారు. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నపిల్లలను మధ్యాహ్నం 12 గంటలకు కొండమీదకు తీసుకువస్తే వారికి శ్రీకృష్ణుని వేషం వేయించి పూజలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఇందుకు గాను పిల్లనగ్రోవి, నెమలి ఈక, చిన్న పంచె తీసుకుని రావాలి. మేకప్ దేవస్థానంలోనే వేయిస్తారని ఈఓ తెలిపారు. రాత్రి ఎనిమిది గంటలకు రత్నగిరి రామాలయం వద్ద, అనంతరం కొండ దిగువన తొలిపాంచా వద్ద సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ఉట్లోత్సవం నిర్వహిస్తారు. తదుపరి ఆంధ్రాబ్యాంక్ వద్ద, ఈరంకి వారి వీధిలో కూడా ఉట్లోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

30 వీఐపీ, పీజీహెచ్ సత్రాల కూల్చివేతకు రంగం సిద్ధం



30 వీఐపీ సత్రం



పీజీహెచ్ సత్రం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం, మెయిన్ క్యాంటీన్ ముందు గల పీజీహెచ్ గెస్ట్‌హౌస్ కూల్చివేయడానికి రంగం సిద్ధమైంది. పీజీహెచ్ గెస్ట్‌హౌస్‌లో తలుపులు, కిటికీలు తొలగించే పని సోమవారం ప్రారంభించారు. కాగా, 30 వీఐపీ సత్రంలో 60 గదులలో మంచాలు, పరుపులు కూడా స్టోర్‌కు తరలించారు. సత్రంలో గదులకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఒకటి రెండు రోజులలో 30 వీఐపీ సత్రం కూడా కూల్చివేస్తారని అధికారులు తెలిపారు. ఈ సత్రంలో వ్యాపారులకు పశ్చిమ రాజగోపురం పక్కన గల ఖాళీ ప్రదేశంలో షాపులు కట్టించి ఇవ్వనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. ఈ సత్రాలు కూల్చివేసిన స్థలంలో భక్తుల కోసం అన్ని వసతులతో విశ్రాంతి షెడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఈ సత్రాలు రెండు శిథిలావస్థకు చేరినందున కూల్చివేస్తున్నామని వివరించారు.

కేసుల పరిష్కారంపై సూచనలు

విజిలెన్స్, ఎక్సైజ్ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ పోలీసులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సోమవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన న్యాయస్థాన ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో అధికారులతో పలు అంశాలను ఆమె చర్చించారు. నాలుగు జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న ఎక్సైజ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎస్ఈబీ, ఎక్సైజ్ కేసులను ఇటీవల ప్రవేశపెట్టిన నూతన జీవోల ప్రకారం అధిక మొత్తంలో పరిష్కారం చేసేందుకు వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, తూర్పు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్పీ పి.సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హోండా 'ఎలివేట్' విడుదల



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

రాజమహేంద్రవరం రూరల్: కార్ల దిగ్గజం హోండా తన ఎస్‌యూవీ మార్కెట్‌ను సుస్థిర పరచుకోవడానికి అధునాతన ఎలివేట్ కారును రాజమహేంద్రవరం ఎలైట్ హోండా షోరూంలో సోమవారం ప్రారంభించింది. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల అధినేత డాక్టర్ గన్నిభాస్కరరావు చేతులమీదుగా కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఎలైట్ హోండా సీఈవో శ్రీనివాసరాజు, ఏజీఎం సేల్స్ నరేంద్ర, సర్వీస్ ఏజీఎం ఆలీ, నగర ప్రముఖులు, ఎలైట్ హోండా టీం సభ్యులు పాల్గొన్నారు. ఏజీఎం సేల్స్ నరేంద్ర మాట్లాడుతూ ఎలివేట్ కారులో సరికొత్త హోండాసెన్సింగ్(ఆదాస్ లెవెల్-2) వంటి అధునాతన ఫీచర్, ఫ్రంట్ ఎల్ఈడీ హెడ్‌లైట్‌ను, స్మార్ట్ ఎలక్ట్రిక్‌సన్‌రూఫ్, హోండా కనెక్ట్‌వాయిస్ కమెండ్స్ విత్ అలెక్స, గూగుల్‌వాయిస్ కమాండ్స్ 65ప్లస్ ఫీచర్స్ ఉన్నాయన్నారు. మొత్తం ఏడు సరికొత్త ఆకర్షణీయమైన రంగులలో లభ్యమవుతుందన్నారు. ఈ కారు ధర రూ.10,99,000 లక్షలు అని తెలిపారు.

సాక్షి
ఫ్యామిలీ
IV
రాజమహేంద్రవరం
మంగళవారం ॥ 5-9-2023

టీచర్స్ డే

'మా టీచర్ ఇలా చెప్పలేదు'
'మా టీచర్ ఇలాగే చెప్పింది'
'మా టీచర్ కోప్పడుతుంది'
'మా టీచర్ మెచ్చుకుంటుంది'
పిల్లలకు ప్రతి సంవత్సరం ఒక ఫేవరెట్ టీచర్ దొరకాలి.
ఇంట్లో తల్లి తర్వాత పిల్లలు తమ ఫేవరెట్ టీచర్ మీదే ఆధారపడతారు.
వారి సాయంతో చదువు బరువును సులువుగా మోసేస్తారు.
వారు ట్రాన్స్‌ఫర్ అయి వెళితే వెక్కివెక్కి ఏడుస్తారు.
'టీచర్స్ డే' సందర్భంగా పిల్లలు అభిమానించే టీచర్ల స్వభావాలూ... లక్షణాలు... అవి కలిగి ఉన్నందుకు వారికి ప్రకటించాల్సిన కృతజ్ఞతలు.



థ్యాంక్యూ టీచర్

పిల్లలు స్కూల్‌కు రాగానే తమ ఫేవరెట్ టీచర్ వచ్చిందా రాలేదా చూసుకుంటారు. ఒకవైపు ప్రేయర్ జరుగుతుంటే మరోవైపు ఒక కంటితో ఫేవరెట్ టీచర్‌ను వెతుక్కుంటారు. క్లాసులు జరుగుతుంటాయి. వింటుంటారు. కాని ఆ రోజు టైమ్‌టేబుల్‌లో ఫేవరెట్ టీచర్ క్లాస్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తారు. స్కూల్లో ఎందరో టీచర్లు. కాని ఒక్కో స్టూడెంట్‌కు ఒక్కో ఫేవరెట్ టీచర్. ఆ టీచర్ మాటను వేదవాక్కుగా భావించేవారు గతంలో ఉన్నారు.. రేపూ ఉంటారు. 'పాప... నువ్వు డాక్టర్ కావాలి' అనంటే డాక్టరైన వారున్నారు. 'బాబూ.. నీకు సైన్స్ బాగా వస్తోంది సైంటిస్ట్ కావాలి' అనంటే ఆ మాటలు మరువక సైంటిస్ట్ అయినవారున్నారు. ఫేవరెట్ టీచర్లు పిల్లలను గొప్పగా ఇన్‌స్పైర్ చేస్తారు. బలం ఇస్తారు. ప్రేమను పంచుతారు. వారే లేకపోతే చదువులు భారంగా మారి ఎందరో విద్యార్థులు కుదేలయి ఉండేవారు.

■ **సబ్జెక్ట్ బాగా వచ్చినవారు**

ఫేవరెట్ టీచర్లు ఎవరు అవుతారు? సబ్జెక్ట్ ఎవరికి బాగా వస్తుందో వారు చాలామందికి ఫేవరెట్ టీచర్ అవుతారు. సబ్జెక్ట్ బాగా వచ్చినవారు అది ఎలా చెప్తే పిల్లలకు బాగా అర్థమవుతుందో తెలుసుకుని చెప్తారు. పిల్లలకు అర్థం కావాల్సింది పాఠం సులభంగా అర్థం కావడం. అర్థమైతే పాఠం పట్ల భయం పోతుంది. భయం పోతే ఆ సబ్జెక్ట్ మరింతగా చదవాలనిపిస్తుంది. అందుకు కారణమైన టీచర్‌ను అభిమానించబుద్ధవుతుంది. సబ్జెక్ట్‌ను అందరికీ అర్థమయ్యేలా చెప్తూ, క్లాసయ్యాక కూడా వచ్చి అడిగితే విసుక్కోకుండా సమాధానం చెప్తారనే నమ్మకం కలిగిస్తూ, చెప్తూ, పాఠం అర్థం కాని స్టూడెంట్‌ను చిన్నబుచ్చకుండా గట్టున ఎలా పడేయాలో ఆలోచించే టీచర్ ఎవరికైనా సరే ఫేవరెట్ టీచర్.

■ **మనలాంటి వారు**

పిల్లలు తమలాంటి టీచర్లను, తమను తెలుసుకున్న టీచర్లను ఇష్టపడతారు. క్లాస్‌లో రకరకాల పిల్లలు ఉంటారు. రకరకాల నేపథ్యాల పిల్లలు ఉంటారు. వారి మాతృభాషను, ప్రాంతాన్ని, నేపథ్యాన్ని గుర్తెరిగి వారితో ప్రోత్సాహకరంగా మాట్లాడే టీచర్లను పిల్లలు ఇష్టపడతారు. 'మీది గుంటూరా? ఓ అక్కడ భలే ఎండలు. భలే కారం మిరపకాయలు దొరుకుతాయిరోయ్' అని ఒక స్టూడెంట్‌తో ఒక టీచర్ అంటే ఆ స్టూడెంట్ కనెక్ట్ కాకుండా ఎలా ఉంటాడు. 'రేపు మీరు ఫలానా పండగ జరుపుకుంటున్నారా? వెరీగుడ్. ఆ పండగ గురించి నాకు తెలిసింది చెప్తానుండు' అని ఏ టీచరైనా అంటే పిల్లలు వారిని తమవారనుకుంటారు. భాషాపరంగా, సంస్కృతి పరంగా పిల్లలు కలిగి ఉన్నదంతా తమది కూడా అని భావించిన ప్రతి టీచర్ ప్రతి విద్యార్థికీ ఫేవరెట్ టీచరే.

■ **మంచి ఫ్రెండ్**

కొందరు టీచర్లు క్లాస్‌లో ఫ్రెండ్‌లా ఉంటారు. 45 నిమిషాల క్లాస్‌లో 40 నిమిషాలు పాఠం చెప్పి ఒక ఐదు నిమిషాలు వేరే కబుర్లు. విశేషాలు మాట్లాడతారు. పిల్లల కష్టసుఖాలు వింటారు. వారి తగాదాలు తీరుస్తారు. ఎవరైనా చిన్నబుచ్చుకుని ఉంటే కారణం తెలుసుకుంటారు. ముఖ్యంగా దిగువ ఆర్థిక పరిస్థితి ఉన్న పిల్లలు ఇలాంటి టీచర్లను చాలా తీవ్రంగా అభిమానిస్తారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి ఒక మనిషి ఉన్నట్టుగా భావిస్తారు. అదే మంచి ఆర్థికస్థితి ఉన్న పిల్లలైతే తమకు ఎమోషనల్ సపోర్ట్ కోసం చూస్తారు. పాఠాల అలజడుల నుంచి ధైర్యం చెప్పే టీచర్‌ను అభిమానిస్తారు.

■ **అందరూ సమానమే**

ఒక టీచర్‌ను పిల్లలు ఎప్పుడు అభిమానిస్తారంటే వారు అందరినీ సమానంగా చూస్తారనే భావన కలిగినప్పుడు. టీచర్లు ఫేవరిటిజమ్ చూపిస్తే ఆ పిల్లల్ని మాత్రమే వారు ఇష్టపడతారని, తమను ఇష్టపడరని మిగతా పిల్లలు అనుకుంటారు. మంచి టీచర్లు అందరు పిల్లల్నీ ఇష్టపడతారు. 'టీచర్ నిన్నే కాదు నన్ను కూడా మెచ్చుకుంటుంది' అని పిల్లలు అనుకునేలా టీచర్ ఉండాలి. కొంతమంది స్టూడెంట్‌లు మంచి మార్కులు తెచ్చుకుంటే వారిని ఎక్కువ పొగిడి కొంతమంది స్టూడెంట్‌లు ఎంత బాగా చదువుతున్నా మెచ్చుకోకుండా ఉండే టీచర్లు పిల్లలను భావోద్వేగాలకు గురిచేస్తారు. టీచర్ మెచ్చుకోలు, టీచర్‌తో సంభాషణ పిల్లల హక్కు. అది పిల్లలకు ఇవ్వగలిగిన టీచర్ ఫేవరెట్ టీచర్.

■ **క్రమశిక్షణ**

పిల్లలు తమ ఫేవరెట్ టీచర్‌లో క్రమశిక్షణ ఆశిస్తారు. టైమ్‌కు సిలబస్ పూర్తి చేయడం, టైమ్‌కి స్కూల్‌కు రావడం, క్లాసులు ఎగ్గొట్టకపోవడం, సరిగ్గా నోట్స్ చెప్పడం, సరిగ్గా పరీక్షలకు ప్రోత్సహించడం, ఎంత సరదాగా ఉన్నా క్లాస్ జరుగుతున్నప్పుడు సీరియస్‌గా ఉండటం... ఇవీ పిల్లలు ఆశిస్తారు. తాము గౌరవించదగ్గ లక్షణాలు లేని టీచర్లను పిల్లలు ఫేవరెట్ టీచర్లు అనుకోరు.

టీచర్ వృత్తి ఎంతో గొప్ప వృత్తి. టీచర్లు కూడా మనుషులే. వారిలోనూ కోపతాపాలు ఉంటాయి. కాని ఎంతోమంది టీచర్లు పిల్లల కోసం తమ జీవితాలను అంకితం చేసి వారి జీవితాలను తీర్చిదిద్దుతారు. 'మీరు పెద్దవాళ్లయి పెద్ద పొజిషన్‌కు వెళితే అంతే చాలు' అంటూ ఉంటారు. మంచి టీచర్లు, గొప్ప టీచర్లు పిల్లల శ్రేయస్సును ఆకాంక్షించి తద్వారా వారి గుండెల్లో మిగిలిపోతారు.

పిల్లల హృదయాల్లో ప్రేమ, గౌరవం పొందిన టీచర్లందరికీ 'టీచర్స్ డే' శుభాకాంక్షలు.

స్ఫూర్తి

విజయం గురించి కలలు కనేవారికి...
విజేతల నోటి నుంచి వచ్చిన మాటలు ఆణిముత్యాలు అవుతాయి.
ఆచరణకు కొత్త మెరుగులు దిద్దుకునే పాఠాలు అవుతాయి.
వరల్డ్స్ యంగెస్ట్ ఫిమేల్ చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన నందిని అగర్వాల్ జోష్ టాక్ (ఇన్‌స్పిరేషనల్ టాక్స్)తో వ్యక్తిత్వ వికాస కోణంలో విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మాటలు చెబుతోంది...

జోష్ టాక్

– కలలకు ఊపిరి



కలలు అనేవి మనకు ఉన్న అతి పెద్ద ఆస్తులు. ఇతరుల అసూయ, ద్వేషాలతో అవి కరిగిపోకుండా చూసుకోవాలి.



నందిని అగర్వాల్‌కు ఎప్పుడూ తొందరే. పరీక్షలు ఇంకో వారంరోజుల్లో ఉంటే 'రేపే అయితే బాగుండేది' అనుకునేది. ఈ తొందర ఆమెను రెండు క్లాసులు జంప్ చేసేలా చేసింది. అలా అన్నకు క్లాస్‌మేట్‌గా మారింది.

మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాకు చెందిన నందిని అగర్వాల్ పందొమ్మిది సంవత్సరాల వయసులో సీఏ ఫైనల్ పరీక్ష ఫలితాలలో (2021)లో ఆలిండియా టాపర్‌గా నిలిచింది. అన్న సచిన్ అగర్వాల్‌కు 18 ర్యాంకు వచ్చింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్విట్టర్‌లో ఈ అన్నాచెల్లెళ్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఒకరోజు నందిని చదువుతున్న స్కూల్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ వచ్చారు. ఆ వ్యక్తి అపురూపంగా కనిపించారు. తాను కూడా గిన్నిస్‌బుక్‌లో పేరు సంపాదించాలని ఆ సమయంలోనే కల కన్నది నందిని.

అప్పుడే ఆమె దృష్టి సీఏపై పడింది.

అయితే సీఏ ఎంట్రెన్స్ కోచింగ్ సమయంలో తనను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం, చిన్నచూపు తనలో మరింత పట్టుదల పెంచింది. అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా సాధించి 'ఔరా' అనిపించింది.

'నా విజయంలో మా అన్నయ్యది ప్రధానపాత్ర. మాక్ టెస్ట్‌లో నాకు అత్తెసరు మార్కులు వచ్చాయి. చాలా నిరాశగా అనిపించింది. మాక్ టెస్ట్‌లోనే ఇలా ఉంటే రియల్ టెస్ట్‌లో ఎలా ఉంటుంది అని భయపడ్డాను. ఆ సమయంలో అన్నయ్య ఎంతో ధీమా ఇచ్చాడు. నువ్వు కచ్చితంగా మంచి మార్కులు తెచ్చుకోగలవు అన్నాడు. ఆ మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించాయి' అంటుంది నందిని.

'నందినిలోని నాకు బాగా నచ్చిన విషయం... బాగా కష్టపడి చదువుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే చెల్లి నాకు స్ఫూర్తి. నందినిని చూసిన తరువాత నేను కూడా చదువుపై బాగా దృష్టి పెట్టాను' అంటాడు సచిన్ అగర్వాల్.

ఇక నందిని అగర్వాల్ 'జోష్ టాక్'లో ఆకట్టుకునే కొన్ని మాటలు...

- కొత్త వ్యక్తులు, కొత్తప్రదేశాలతో నిరంతర పరిచయం మన ప్రపంచాన్ని విస్తృతం చేస్తుంది.
- జీవితం సులభంగా సాగిపోవాలంటే కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
- వ్యక్తిగత స్వార్థంతో చేసే సహాయానికి విలువ ఉండదు
- 'నువ్వు ఇలాగే ఉంటావు. ఇది మాత్రమే సాధించగలవు' అనే మాటలు అవతలి వ్యక్తుల నుంచి రాకుండా చూసుకోవాలి. మనం ఎలా ఉండాలి అనేది మనం నిర్ణయించుకోవాలి, మనం ఏది సాధించగలమో మనకు తెలిసి ఉండాలి. 'నీవల్ల ఏమవుతుంది!' అనేది ఎంతోమంది విజేతలకు సుపరిచితమైన మాట. ఆ మాటను తేలిగ్గా తీసుకొని 'కచ్చితంగా నా వల్లే అవుతుంది' అని వారు అనుకోవడం వల్లే విజేతలయ్యారు.
- జీవిత సత్యాలను ఎక్కడినుంచైనా నేర్చుకోవచ్చు. చివరికి ఐస్‌క్రీమ్ నుంచి కూడా! 'ఎంజాయ్ ది లైఫ్ బిఫోర్ ఇట్ మెల్ట్స్'
- సక్సెస్‌ఫుల్ లీడర్‌లు వర్క్‌ను ప్లాన్ చేసుకుంటారు. ప్లాన్ చేసుకున్న దానిపై బాగా వర్క్ చేస్తారు.
- నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకోలేకపోతే ఇతరులను ఎప్పుడూ కంట్రోల్ చేయలేవు. కలల సాధనకు కష్టాన్ని జోడించకపోతే కల కనే అర్హత కోల్పోతాం
- మన జీవితానికి హ్యాపీ వెర్షన్ ఏమిటంటే బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లడం
- పనిలో తప్పులో చేసినా ఫరవాలేదుగానీ ఏమీ చేయకపోవడమంత తప్పు మరొకటి లేదు.
- మనం ఎక్కువగా భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటాం. గతంలో జరిగిన పొరపాట్ల గురించి అదేపనిగా పశ్చాత్తాపపడుతుంటాం. నిజానికి మనం చేయాల్సింది... వర్తమాన జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించడం.
- మీ టైమ్‌ను సేవ్ చేసుకోకపోవడం తెలియకపోతే, టైమ్ మిమ్మల్ని సేవ్ చేయదు.

సాగుబడి

పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి

'కొబ్బరి'లో 'సుగంధా'ల గుబాళింపు!

- కొబ్బరి తోటల్లో కోకో సహా అనేక అంతర పంటల సాగుకు దక్షిణ కోస్తా జిల్లాలు అనుకూలం
- వక్క, మిరియాలు, అల్లం, పసుపు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్య పంటల సాగు
- కొబ్బరికి తోడుగా అంతర పంటలతో రైతులకు చేకూరుతున్న అదనపు ఆదాయం

ఉద్యాన తోటల్లో సైతం ఏదో ఒకే పంటపై ఆధారపడకుండా.. అంతర పంటల సాగు చేస్తేనే రైతులకు వ్యవసాయం గిట్టుబాటవుతుంది. కొబ్బరి రైతుల పాలిట అంతరపంటల సేద్యం కల్పతరువుగా మారింది. దక్షిణ కోస్తా ఆంధ్రా జిల్లాల్లో వాతావరణం కొబ్బరి సాగుకు అనుకూలం. అందువల్లనే ఏపీ కొబ్బరి తోటల విస్తీర్ణంలో 50 శాతానికిపైగా పాత ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఉంది. కొబ్బరి తోటల్లో ఉండే పాక్షిక నీడ వల్ల చల్లని వాతావరణం ఏర్పడుతుంది. ఆ వాతావరణం సుగంధ ద్రవ్య పంటల (స్పైసెస్)కు ఎంతో అనువైనది. ముదురు కొబ్బరి తోటల్లో అనేక సుగంధ ద్రవ్య పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ, నేరుగా మార్కెటింగ్ చేసుకుంటున్న రైతుల విజయగాథలెన్నో. విశేష ప్రగతి సాధిస్తున్న అటువంటి ఇద్దరు ప్రకృతి వ్యవసాయదారులు ఉప్పలపాటి చక్రపాణి, జుజ్జూరి సతీశ్‌ల సుసంపన్న అనుభవాలను తెలుసుకుందాం..

కొబ్బరి+ వక్క+ మిరియాలు+ సిలోన్ దాల్చిన చెక్క+ పసుపు..

గత ఐదారేళ్లుగా కొబ్బరిలో అంతర పంటలు సాగు చేస్తూ.. వీటి ద్వారా ప్రధాన పంటకు తగ్గకుండా అదనపు ఆదాయం పొందవచ్చని రైతు శాస్త్రవేత్త ఉప్పలపాటి చక్రపాణి రుజువు చేస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చక్రపాణి గత 13 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కొబ్బరి తోటలో వక్క, మిరియాలు, పసుపు అల్లం పండిస్తూ సంతృప్తికరమైన ఫలితాలు సాధిస్తున్నారు. కొబ్బరి తోటలో ఆరేళ్ల క్రితం నాటిన 2,500 వక్క చెట్లు చక్కని ఫలసాయాన్నిస్తున్నాయి. ఈ ఏడాది 700 వక్క చెట్లకు కాపు వచ్చింది. 2 టన్నుల ఎండు వక్కకాయల దిగుబడి ద్వారా రూ. 3 లక్షల 80 వేలు ఆదాయం వచ్చిందని చక్రపాణి వివరించారు. 300 కొబ్బరి చెట్లకు ఐదారేళ్ల క్రితం మిరియాల తీగలను పాకించారు. వీటిద్వారా 500 కిలోల ఎండు మిరియాల దిగుబడి వచ్చింది. కేజీ రూ.600 చొప్పున రిటైల్‌గా అమ్ముతున్నారు.

గానుగ నూనెతో ఆరోగ్యం

కొబ్బరి చెట్ల మధ్య వక్క చెట్లు పెంచి.. కొబ్బరి చెట్లకు అనేక ఏళ్ల క్రితమే మిరియం మొక్కల్ని పాకించడంతో చక్రపాణి కొబ్బరి తోట వర్టికల్ గ్రీన్ హెవెన్‌గా మారిపోయింది. కొబ్బరి చెట్లకు మిరియం మొక్కలు చుట్టుకొని ఉంటాయి కాబట్టి, మనుషులను ఎక్కించి కొబ్బరి కాయలు దింపే పద్ధతికి స్వస్తి చెప్పారు. కాయల్లో నీరు ఇంకిన తర్వాత వాటికవే రాలుతున్నాయి. రాలిన కాయలను అమ్మకుండా.. సోలార్ డ్రయ్యర్‌లో పూర్తిగా ఎండబెట్టి కురిడీలు తీస్తున్నారు. కురిడీలతో గానుగల ద్వారా సేంద్రియ కొబ్బరి నూనె తీసి నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. రెండేళ్లుగా తాము ఇంట్లో వంటలకు తమ సేంద్రియ కొబ్బరి నూనెనే వాడుతున్నామని, చాలా ఆరోగ్య సమస్యలు తీరటం గమనించామని చక్రపాణి సంతోషంగా చెప్పారు.


చక్రపాణి కొబ్బరి తోటలో సాగవుతున్న అంతర పంటలు


కొబ్బరి, వక్క తోటలో అంతరపంటగా పసుపు

కేరళ మాదిరిగా ఇక్కడా పండిస్తున్నా!

రైతులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లోనే పంటలు పండించటం నేర్చుకోవాలి. పశ్చిమ గోదావరి జిల్లాలో అప్‌లాండ్ ఏరియాలో ఉద్యాన తోటలకు అనువైన వాతావరణం ఉంది. ఇవి సారవంతమైన భూములు. ఇక్కడి నీరు కూడా మంచిది. నాలుగైదేళ్లుగా భూగర్భజలాలు పెరగడంతో నీటి సమస్య లేదు. కొబ్బరిలో అంతర పంటలకు అనుకూలంగా ఉండేలా ముందే తగినంత దూరంలో మొక్కలు నాటుకొని సాగు చేసుకోవచ్చు. అంతర పంటలద్వారా సూక్ష్మ వాతావరణం సృష్టించుకొని కేరళలో మాదిరిగా సుగంధ ద్రవ్య పంటలు సాగు చేసుకోవచ్చు. కేరళలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మన దగ్గర 45 డిగ్రీల వరకు వస్తుంది. కొబ్బరిలో అంతర పంటల వల్ల బయటతో పోల్చితే పది డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఎండ, గాలిలో తేమ సమపాళ్లలో చెట్లకు అందుతున్నందున కేరళలో మాదిరిగా మిరియాలు, దాల్చిన చెక్క ఇక్కడ మా తోటలోనూ పండుతున్నాయి.


– ఉప్పలపాటి చక్రపాణి (94401 88336), లక్ష్మీపురం, పెదవేగి మం., ఏలూరు జిల్లా

పసుపు ఫ్లేక్స్

కొబ్బరి తోటలో వక్క, మిరియాలతో పాటు రెండేళ్లుగా అటవీ రకం పసుపును కూడా సాగు చేస్తున్నారు చక్రపాణి. ఈ రకం పసుపు వాసన, రంగు చాలా బాగుంది. పచ్చి పసుపు కొమ్ములను పల్చటి ముక్కలు చేసి, సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెట్టి, ఆ ఫ్లేక్స్‌ను అమ్ముతున్నారు. వాటి వాసన, రంగు, రుచి అద్భుతంగా ఉన్నాయని వాడిన వారు చెబుతున్నారన్నారు.

సిలోన్ దాల్చిన చెక్క బెటర్

కొబ్బరిలో వక్క వేయడంతో పైకి తోట వత్తుగా కనిపించినా నేలపైన అక్కడక్కడా ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీల్లో గత ఏడాది నుంచి అటవీ పసుపుతో పాటు అల్లం, సిలోన్ దాల్చిన చెక్క, నట్‌మగ్‌లను సాగు చేస్తున్నామని చక్రపాణి తెలిపారు. సాధారణంగా మనం ఇళ్లలో వాడే దాల్చిన చెక్క విదేశాల నుంచి దిగుమతయ్యే సాధారణ రకం. సిలోన్ దాల్చిన చెక్క రకం దీనికన్నా మెరుగైనది. ఇది పల్చగా ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైనదని నిపుణులు చెబుతున్నారు. ఇది కూడా కోస్తా ఆంధ్రలో బాగా పండుతోందని చక్రపాణి వివరించారు. కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగు ద్వారా అధికాదాయం పొందేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పెదవేగి మండల ఉద్యాన అధికారి ఎం. రత్నమాల తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

– కొత్తపల్లి వినోద్‌కుమార్, సాక్షి, పెదవేగి, ఏలూరు జిల్లా

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన జుజ్జవరపు సతీశ్ గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కొబ్బరి తోటలో ఐదంచెల సాగు ద్వారా ఎకరానికి ఏటా రూ.1,05,000 నికరాదాయం పొందుతున్నారు. మోటార్ బైక్‌తో నడిచే ట్రాలీని, బైక్‌తో నడిచే స్ప్రేయర్‌ను తానే తయారు చేయించుకోవటం ద్వారా కూలీల ఖర్చును భారీగా తగ్గించుకోవటం ఆయన ప్రత్యేకత. రైతుసాధికార సంస్థలో మాస్టర్ ట్రైనర్‌గా పనిచేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా మారారు. ఆయన స్ఫూర్తితో కురుకూరు గ్రామానికి చెందిన సుమారు పాతిక మంది రైతులు 300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. రిటైర్డ్ ఐసిఏఆర్ ఉద్యోగుల సంఘం సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డుతో సతీశ్‌ను ఇటీవల హైదరాబాద్‌లో సత్కరించటం విశేషం. కొబ్బరి తోటలో ఐదంచెల అంతర పంటలను ఆయన సాగు చేస్తున్నారు. మొదటి లేయర్‌గా 27×27 అడుగులకు కొబ్బరి, రెండో లేయర్‌గా కొబ్బరి చెట్ల మధ్యలో 13.5×10 అడుగులలో కోకో సాగు చేస్తున్నారు. మూడో లేయర్‌లో 7×7 అడుగులలో వక్క మొక్కలు వేశారు. నాలుగో లేయర్‌లో వక్క మొక్కలకు మిరియాలు పాకిస్తున్నారు. ఐదో లేయర్ గా ఎండ పడే చోట పైనాపిల్ మొక్కలు నాటారు. కొబ్బరి మొక్కలు లేని చోట్ల జాజికాయ మొక్కలు నాటారు.

ప్రతి 10 రోజులకు జీవామృతం డ్రిప్ ద్వారా ఇస్తున్నారు. పిచికారీ కోసం టైప్ 2 సూపర్ జీవామృతం వాడుతున్నారు. సాధారణంగా జీవామృతం తయారీకి ప్రతి సారీ ఆవు పేడ, మూత్రం అవసరం ఉంటుంది. అయితే, టైప్ 2 జీవామృతం తయారీకి ఒకసారి పేడ, మూత్రం వాడితే చాలు, ఆ తర్వాత 6 నెలల వరకు ఆ అవశేషాలకు 200 లీటర్ల నీటికి లీటరు జీవన ఎరువులతో పాటు బెల్లం జోడిస్తూ మళ్లీ మళ్లీ జీవామృతాన్ని తయారు చేసుకొని వాడటం వల్ల అదే ఫలితాలు వస్తున్నాయన్నారు.

జీవామృతం వడపోతకు తాను రూపొందించిన ఆటోమేటిక్ ఫిల్టర్ సిస్టమ్‌ను మరో 20 మంది రైతులు 200 ఎకరాల తోటల్లో వాడుతున్నారని సతీశ్ (90107 42459) తెలిపారు.

- 8-10 కూలీలు అవసరమయ్యే పనులను బైక్ ట్రాలీతో ఇద్దరు చేస్తున్నారు.
- కొబ్బరి+ అంతర పంటల ద్వారా ఎకరానికి రూ. 1.05,000 నికరాదాయం
- రైతు సతీశ్‌కు సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డు ప్రదానం

బైక్ ట్రాలీ వాడకంతో తగ్గిన కూలీల ఖర్చు




బైక్ ట్రాలీ ఖర్చు రూ. పది వేలు

ద్విచక్ర మోటారు వాహనానికి వెనుక కట్టుకొని బరువులు లాక్కెళ్లేందుకు వీలుగా ఐదేళ్ల క్రితం సతీశ్ బైక్ ట్రాలీని సొంత ఆలోచనతో తయారు చేయించుకొని వినియోగిస్తున్నారు. ఎరువులు వేయటం వంటి పనులకు ఎకరానికి 8–10 మంది కూలీలు అవసరమవుతారని బైక్ ట్రాలీ ఉండటం మూలాన ఇద్దరు కూలీలతోనే వేగంగా పని పూర్తవుతోందని సతీశ్ తెలిపారు. బైక్ ఇంజన్‌తోనే జీవామృతం, పంచగవ్య, ఇతర ద్రావణాలు, కషాయాలను సైతం సులువుగా పిచికారీ చేయగలుగుతున్నానని తెలిపారు. బైక్ ట్రాలీ తయారీకి రూ. పది వేలు ఖర్చయ్యిందని, ఈ ఐదేళ్లలో దాని ద్వారా దాదాపు రూ. 2 లక్షల వరకు డబ్బు ఆదా అయ్యిందన్నారు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయం సులువు కావటం వల్ల ఇతర రైతులు సైతం స్ఫూర్తిని పొందుతున్నారన్నారు. తనను చూసి పాతిక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారన్నారు. జీవామృతాన్ని ఫిల్టర్ చేయటం, పిచికారీ చేయటం వంటి పనుల్లో కూడా మనుషుల ప్రమేయం తగ్గించే ఫిల్టర్ వ్యవస్థను నిర్మించటం వల్ల వడకట్టే పని సులువైపోయిందని, పిచికారీ చప్పున పూర్తవుతోందన్నారు. బైక్ స్ప్రేయర్ ద్వారా ఎకరంలో అర గంటలోనే పిచికారీ పూర్తవుతోందన్నారు. టైప్ 2 సూపర్ జీవామృతం తయారీ పద్ధతి రైతులకు వెసులుబాటుగా ఉందన్నారు.

సేంద్రియ సాగుపై రైతు సదస్సులు

'నాబార్డు' సహకారంతో 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో సేంద్రియ సాగు పద్ధతులు, కషాయాలు/ద్రావణాల తయారీ, విలువ జోడింపుపై తెలంగాణలో రైతులకు అవగాహన సదస్సులు జరగనున్నాయి. 9న కరీంనగర్ జిల్లా చొప్పదండి మం., పెద్దకురుంపల్లిలోని మల్లిఖార్జున రెడ్డి తోటలో, 10న జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లోని ఎడమల మల్లారెడ్డి తోటలో, 11న పెద్దపల్లి జిల్లా రామగిరి మం., కల్వచర్లలోని యాదగిరి శ్రీనివాస్ తోటలో (ఉ.10 గం.-సా. 4 గం.) సదస్సులు జరుగుతాయి. పాల్గొనదలచిన రైతులు తప్పనిసరిగా ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు.. 70939 73999 (వెంకట్‌రెడ్డి). అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం.